# మా యింటి రోలు




అరిగే రామారావు

"రోట్లోవేసి దంచితేగానీ మామిడికాయ తొక్కుడు పచ్చడికి రుచిరాదు'' అని నా కర్మానికి నోరుజారి అన్నాను.

ఇకంతే! ఇంట్లోని పిల్లబొందలందరూ రోలంటే ఏంటీ, రోకలంటే ఏంటీ అని సవాలక్ష ప్రశ్నలు వేసి, రకరకాల వ్యాఖ్యానాలు చేసి నన్ను ఎగ తాళి పట్టించారు.

పాతికేళ్ళు వచ్చినా పెళ్ళీపెటాకులూ వద్దని సాఫ్ట్‌వేర్ వెలగబెట్టుతున్న నా చిన్నకూతురు ఈ పిల్ల గ్యాంగు కంతా గ్యాంగులీడరు.



''యు డోంట్ నో రోల్? రియల్లీ? రోల్ మీన్స్ రాక్ అండ్ రోల్... రోల్ రోల్...'' అని పొగడం మొదలుపెట్టింది.

దాంతో మా పెద్దోడి చిన్నకూతురూ, మా చిన్నోడి పెద్దకూతురూ, వీడియో గేమ్స్ ఆడుకోవటానికొచ్చిన కాలనీలోని పిల్లలందరూ మా సాఫ్ట్‌వేర్‌దాన్తో పొగటం మొదలుపెట్టారు.

నాకు కోపం ముంచుకొచ్చింది. నిజంగానే యిప్పుడు ఆ రోలూ రోకలీ వుంటేనా వీళ్ళందర్నీ ఆ రోట్లో వేసి కసితీరా దంచివుండేదాన్ని.

నాకేడ్పు వచ్చినంతపనయింది. చేతిలో పని అవతల పారేసి టెర్రస్‌లోకి వచ్చి, ఒక కుర్చీ లాక్కుని కూలబడ్డాను.

వీళ్ల మొగాలు మండా, ఈ కాలం వాళ్లకు రోలంటే తెలియదు. రోకలంటే తెలియదు. వీళ్లకే కాదు. వీళ్ల మమ్మీలక్కూడా తెలియదు.

మొన్నగాక మొన్న మా చిన్నకోడలు, 'రోలంటే ఏంటి అత్తయ్యగారూ?'' దీర్ఘంతీస్తూ అడిగింది.

నాకేడ్వాలో నవ్వాలో తెలియలేదప్పుడు. రోళ్లూ రోకళ్ల రోజులు పోయాయి. ఇప్పుడన్నీ మిక్సీలు, గ్రయిండర్లూ వచ్చిపడ్డాయి. రోలంటే వీళ్లకెట్లా తెలుస్తుంది పాపం!

నాకెందుకో తెలియదుగానీ చిన్నప్పట్నుంచీ రోలంటే ఒకవిధమైన అభిమానమూ, అనుబంధమున్నూ!

మా పుట్టింట్లో నా చిన్నప్పుడు మా యింటి గోడకు ఒక పెద్ద చిత్రపటం వుండేది. అల్లరి చిన్నికృష్ణయ్యను వాళ్లమ్మ యశోదమ్మ రోలుకు కట్టేసిన చిత్రమది. చిత్రం కాకపోతే, ఆ జగన్నాటక సూత్రధార్ని రోటికేసి బంధించటమేంటీ? ఆ చిన్నిబాలుడు దాన్ని లాక్కుంటూ వెళ్లి, వాళ్ల దొడ్లోని పెను వృక్షాలను పడేయటమేమిటి? వృక్ష రూపంలో వున్న శాపగ్రస్తులకు శాప విమోచనం కలిగించటమేమిటీ?

నిజంగా ఎంత అద్భుతమైన దృశ్యం. మరెంత నిగూఢమైన సన్నివేశం!

శ్రీకృష్ణభగవానుడ్ని కట్టేసిన ఆ రోలును చూస్తూ నాలో నేను నవ్వుకునేదాన్ని.

''ఆ ఫోటోలో ఏం వుందే, ఎప్పుడూ దాన్నే అంత యిదిగా చూస్తుంటావు?'' అనేది మా నానమ్మ.

అట్లా మొదట్నుంచీ రోలంటే ఒకవిధమైన యిష్టం ఏర్పడింది. అందులోనూ మా దొడ్లోని రోలంటే మరీ యిష్టం.

మా యింటి రోలుకూ, నాకూ ఏదో చిత్రమైన అనుబంధం వుంది. ఆ రోలు 'రోల్' నా జీవితంలో ఎంతో వుంది.

మా యింటి రోలు ఏం చిన్నదీ చితకదీ కాదు. ఇంత ఎత్తున వుండేది. దాదాపు మూడూ, మూడున్నర అడుగులు వుండేది. గుండ్రంగా, గుమ్మటంగా వుండేది.

అది తెల్లరాయి రోలు. ఎండలో తళతళా మెరుస్తూ అందంగా వుండేది. మా బాదంచెట్టు ఆకుల నీడలు దానిమీద కదుల్తున్నప్పుడు మరీ అందంగా వుండేది.

అంత పెద్ద రోలు మా వాడకట్టులో ఎవరికీ వుండేది కాదు

మా వాడకట్టులో ఎవ్వరికీ ఏ దంపుళ్లు అవసరమొచ్చినా మా యింటికే వచ్చేవాళ్లు. పండుగలూ పబ్బాలూ వచ్చాయంటే మా రోలుకెంతో డిమాండు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ రోజుల్లో మా వాడకట్టు అమ్మలక్కలందరూ అరిసెలకు బియ్యప్పిండి దంచుకోటానికి వచ్చేవాళ్లు. మా దొడ్డి తలుపు తట్టినవాళ్లు తట్టినట్టే వుండేవాళ్లు.

మాటిమాటికి దొడ్డి తలుపు తీసేయ్యలేక మా నానమ్మ విసుక్కుంటుండేది. నేను మాత్రం తలుపు శబ్దం వినిపించడం ఆలశ్యం పరిగెట్టుకుంటూ వెళ్లి తీసేదాన్ని. అందుకని వాళ్లందరూ తలుపుతట్టుతూ, 'చిన్నమ్మాయి గారూ!', 'అమ్మాయి జయమ్మా!' అంటూ నా పేరే పిలిచేవాళ్లు. వాళ్లు అలా నా పేరుపెట్టి పిలవడం నాకెంతో గర్వంగా వుండేది!

మా దొడ్లో బాదం చెట్టూ, జాంచెట్టూ, సపోటా చెట్టూ, కొబ్బరి చెట్టూ లాంటి ఫలవృక్షాలెన్నో వున్నాయి. మధ్యాహ్నంపూట ఆ చెట్ల నీడలో మా రోలు మీద కూర్చుంటే ఎంతో హాయిగా, ఆనందంగా వుండేది. ఒకసారి నేనూ కూర్చొని కసిక్కిన తుమ్మేను. అప్పుడే అటొచ్చిన నానమ్మ 'ఓసి బొందా! రోలు మీద కూర్చొని తుమ్మేవా? అట్టాగే కూర్చొని తగలడు. లేవమాకు!' అని గబగబా యిన్ని వుండ్రాళ్లు చేసి తీసికొచ్చి నా నెత్తిమీద పోసింది. ఆపూట నా చిరుతిండి ఆ ఉండ్రాళ్లే.

ఎవరింట్లో ఏ పెళ్లి జరిగినా, ఏ శుభకార్యం జరిగినా మొదటి పసుపువాయి కొట్టడానికి మా యింటి రోటికే వచ్చేవాళ్లు. వచ్చిన ముత్తయిదులు మా రోలును శుభ్రంగా కడిగి, చుట్టూ పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి, తమలపాకుల తోరణం దాని చుట్టూ కట్టేవాళ్లు.

అప్పుడు చూడాలి మా యింటి రోలు అందం. సింగారించుకున్న బుట్టబొమ్మలా వుండేది. కొత్తగా సమర్తాడి పచ్చి తాటాకుల మీద సిగ్గుగా తలవంచుకొని కూర్చున్న కన్నెపిల్లలాగా వుండేది!

వచ్చిన ముత్తయిదులతోపాటు నాకూ కాళ్లకు పసుపురాసి, మెడకు గంధంపూసి, బొట్టుపెట్టి తాంబూలం అరిటిపళ్లూ నా చేతికిచ్చేవాళ్లు. నాకప్పుడు బలే సిగ్గుగా వుండేది.

అచ్చివచ్చిన రోలని మా రోలును అందరూ మెచ్చుకుంటుంటే నాకెంతో గర్వంగా వుండేది.

మా దొడ్లో బాదం చెట్టూ, జాంచెట్టూ, సపోటా చెట్టూ, కొబ్బరి చెట్టూ లాంటి ఫలవృక్షాలెన్నో వున్నాయి. మధ్యాహ్నంపూట ఆ చెట్ల నీడలో మా రోలు మీద కూర్చుంటే ఎంతో హాయిగా, ఆనందంగా వుండేది. ఒకసారి నేనూ కూర్చొని కసిక్కిన తుమ్మేను. అప్పుడే అటొచ్చిన నానమ్మ, 'ఓసి బొందా! రోలుమీద కూర్చొని తుమ్మేవా? అట్టాగే కూర్చొని తగలడు. లేవమాకు!' అని గబగబా యిన్ని వుండ్రాళ్లు చేసి తీసికొచ్చి నా నెత్తిమీద పోసింది. ఆపూట నా చిరుతిండి ఆ ఉండ్రాళ్లే.

నాకు సిగ్గేసే పని ఆ తర్వాత మా రోలు ఇంకొకటి చేసింది! తర్వాతంటే, నాల్గయిదేళ్ల తర్వాతన్న మాట!

మా రోలు ప్రక్కనే మా యింటి ప్రహరీగోడ వుండేది. ఆ గోడకానుకుని పెద్ద గన్నేరు పూల చెట్టు వుండేది.

ఒకరోజు అలా మా రోలెక్కి గన్నేరు పూలు కోస్తోంటే నాకేదో అయినట్లనిపించింది.

మళ్లీ మా నానమ్మే పసిగట్టింది.

''ఒసేవ్ మాలక్ష్మీ! చిన్నది పెద్దమనిషయిందే!'' అని మా అమ్మను కేకేసింది.

ఆ తర్వాత చెప్పేదేముంది. ఇంట్లో బోలెడు హడావుడి. ఆరోజుల్లో యింట్లో ఆడపిల్ల సమర్తాడిందంటే ఎంతేసి హంగామా చేసేవాళ్లో! పచ్చితాటాకుల మీద కూర్చోపెట్టడం, సమర్త పేరంటాలూ, హారతి పాటలూ, కొంటె మాటలూ, చిమ్మిరి వుండలూ, తొమ్మిదో రోజున సమర్తపంక్తీ, కొత్త పట్టు పరికిణీలూ, వోణీలూ – అబ్బ, ఎన్ని వేడుకలో ఎంత సందడో! ఛీ, ఇప్పటిలాగానా!

అందుకే, మా రోలంటే నాకెంతో యిష్టం!

రాత్రిపూట వెన్నెల్లో మా రోలు అందంగా, నిండుగా కనిపించేది. కొబ్బరాకుల సందుల్లోంచి జాలువారే వెన్నెల్ని కడుపునిండా జుర్రుకొని, మా నానమ్మ వెన్న చిలికిన మజ్జిగకుండ లాగా వుండేది.

రాత్రుళ్లు యింట్లో అందరి భోజనాలయ్యాక మా అమ్మ వంటిల్లు అలికి ముగ్గులు పెట్టి వచ్చేలోపల నేను మా రోలు మీద కూర్చొని చందమామను చూస్తూ, సరదాగా చుక్కల్ని లెక్కపెడుతూ వుండేదాన్ని. మా నానమ్మ, 'ఒసే బొందా! ఆ రోలు మీద ఏం చేస్తున్నావే? చీకట్లో పురుగూ పుట్రా వుంటాయే!' అని కేకేసేది.

ఒకసారి ఏమయిందంటే – ఒకరాత్రి మా అమ్మకు వంట్లో బాగోలేదని భోజనాలు వడ్డించే డ్యూటీ నానమ్మ తీసుకుంది.

అన్నం తిని ఎప్పటిలాగే గబగబా రోలుకాడికి వెళ్లబోయి మా నూతి పళ్లెం దగ్గరే ఆగిపోయాను.

రోలుమీద అమ్మ కూర్చొని వుంది. ఆ కూర్చోవటంలో ఏదోగా వుంది. అప్పుడు వెన్నెలేగానీ, వెన్నెల దిగాలుగా వుంది, కనిపించని బరువేదో పోస్తున్నట్లుంది.

నిదానంగా ఆగి చూద్దునుగదా – అప్పుడు అమ్మ ఎందుకో ఏడుస్తోంది... పొర్లి పొర్లి ఏడుస్తోంది...

ఇంట్లో వాళ్లందరి కడుపులూ ఎప్పుడూ నిండుగా, చల్లగా వుండేటట్లు చూసే అమ్మ కడుపులో అంత ఏడ్పు దాచుకుందా? ఎందుకు, ఏవయింది అమ్మకు?

ఆ తర్వాత నానమ్మ చెబితే తెల్సింది. మా నాన్న గుడివాడలో ఎవరినో వుంచుకున్నాడంట.



## కిమిన్నాస్తి

*రాజకీయాల్లో ఎవరూ శాశ్వత మిత్రులు కాదు ఎవరూ శాశ్వత శత్రువులూ కాదు అంటారు కదా.. ఈ సూక్తి సినిమా వాళ్లకు కూడా వర్తిస్తుంది. తాజ్‌మహల్ సినిమా విషయమై అక్బర్‌ఖాన్, కిమ్‌శర్మల మధ్య నడుస్తున్న లడాయ్ అందరికీ తెలిసిందే. విచిత్రంగా ఈ మధ్యనే వాళ్లిద్దరూ మళ్లీ జట్టు కట్టేశారు. అక్బర్ భార్య కిమ్‌ను ఇంటికి విందుకు పిలిచి మరీ మాటలు కలిపేసిందిట. మరి భార్యాభర్తలకు ఎవరూ చెప్పారోగానీ ఇద్దరూ ఇప్పుడు సంధియుగంలోకి వచ్చేశారు. కిమ్ కూడా కిమిన్నాస్తిగా వుంటోంది. భళం...*

అదే మొదలు. ఆ తర్వాత మా అమ్మ ఎన్నో రాత్రిళ్లు మా రోలుమీద వంటరిగా కూర్చొని నిశ్శబ్ధంగా రోదించటం ఎన్నోసార్లు చూశాను. అలా ఏడ్చి ఏడ్చీ ఎప్పుడో లోపలికి వచ్చి పడుకునేది.

మా రోలు గుండె బరువుల్ని దింపుకునేచోటు. అందుకనే మా దొడ్లో రోలంటే నాకెంతో ఇది!

పిచ్చి మొద్దులాగా, అమాయకంగా పైకి అలా వుంటుందిగానీ మా రోలు బలే కొంటెది! ఎలా అంటారా? ఒకసారి ఏమయిందంటే - ఒక దొంగ పిల్లి రోజూ వచ్చి మా యింట్లో పాలూ పెరుగూ తాగిపోతుండేది. నానమ్మ దానిమీద పగబట్టింది. కాపుకాసి ఒకరోజు ఎట్లాగో దాన్ని వడిసి పట్టుకుంది. మా రోలుమీద పెట్టి ఆ దొంగపిల్లి చెవుల కొసలు కత్తితో కట్ చేసింది. బాధతో అది అరిచింది అరిచినట్లే వుంది.

నానమ్మ చేసిన పని మా రోలుకు నచ్చినట్లు లేదు. ఆ తర్వాత ఒకరోజు రాత్రి నానమ్మ దొడ్లోకెళ్లి వస్తూ చీకట్లో చూసుకోక రోలుకు కాలు తగిలి ముందుకు పడింది. దాంతో ముక్కూ మొగం ఏకమై వారంరోజులు మంచం పట్టింది. నానమ్మను కావాలనే మా రోలు కాలు అడ్డంపెట్టి పడేసి వుంటుందనుకున్నాను. అప్పట్నుంచీ ఆ రోలంటే నానమ్మకు తెగ కోపం. నాకయితే తెగ యిష్టం!

అసలు విషయం చెబితే మీరు మరీ బడాయి అంటారేమో!

మా రోలుకూ నాకూ ఎంత విడదీయరాని అనుబంధం అంటే ఆఖరికి నా పెళ్లిచూపులు కూడా దానిదగ్గరే జరిగాయి.

అంతా చాలా గమ్మత్తుగా జరిగింది.

మావారి మేనత్త నూజివీడు కోనేరుపేటలో వుండేది. ఆరోజుల్లో ఆయన మెద్రాసు లాకాలేజీలో చదువుతుండేవారు. ఒకసారి శలవుల్లో వాళ్ల మేనత్త దగ్గరికి వచ్చారు. అప్పుడు పెళ్లిమాటలు జరిగాయి. నానమ్మ వాళ్ల మేనత్తతో మాట్లాడి చూసి వచ్చింది.

మస్తాన్ జట్కా బండి దిగి లోపలికి వస్తూ,

'ఒసేవ్ మాలక్ష్మీ! నాకయితే ఆ అబ్బాయి బాగా నచ్చాడు. ముందు పిల్లను చూస్తానంటున్నాడు. ఈ రాత్రికే మెయిల్‌లో మెద్రాస్ వెళ్లిపోతున్నాడంట. ఇవ్వాళ సాయంత్రం నాలుగ్గంటలకు బాగుంది. పెళ్లి చూపులకు వప్పుకొని వచ్చాను. ఈ గుంట ఎక్కడికి వెళ్లిందీ!'' అంటూ తెగ హడావిడి పడిపోతోంది.

నేనప్పుడే సోందేవమ్మగారి చిన్నమ్మాయితో వైకుంఠపాళి ఆడి వస్తున్నాను.

''రావే పెళ్లికూతురా! ఇవ్వాళ సాయంత్రమే నీకు పెళ్లిచూపులు!'' సంభ్రమంగా అంది.

నేను, ''మరీ అంత మురిసిపోకే ముస్సలిదానా! ముందా చాప వసారాలో పడేయ్!'' అన్నాను.

మూతిమీద వేలేసుకుంటూ, ''ఓస్సి నీ ముట్టు ముక్కలైపోనూ!'' అంది.

ముసలిముండ మా నానమ్మ చాలా డేరింగ్.

ఇవ్వాళ పెళ్లిచూపులు కుదరదని మంగతాయరమ్మ గారికి కబురుపెట్టమని మా అమ్మ ఒకవైపు మొత్తుకుంటున్నా విన్లేదు.

''అనుకున్న ప్రకారం జరగవల్సిందే. నేనెలా మేనేజ్ చేస్తానో చూడవే కోడలా!'' అంది.

అనుకున్న టైంకు జట్కాబళ్లు వచ్చి మా యింటి ముందు ఆగాయి.

మెద్రాస్ లా కాలేజీ స్టూడెంటుగారు టిప్పుటాపుగా ముందు జట్కా దిగేరు. ఆయన వెంట వచ్చినవాళ్లు బిలబిలా లోపలికి వచ్చారు.

నానమ్మ ''ముందు మా యిల్లంతా చూద్దువుగాని రా బాబు!'' అని లోపలికి తీసుకొచ్చింది.

ఆయన వెంట వచ్చినవాళ్లు సావిట్లోనే కూర్చుండిపోయారు.

''ఇది మా పూజగది, ఇది మా హాలు, ఇది మా వుయ్యాల బల్ల, ఇది మా వంటిల్లు. ఇది మా గొడ్ల సావిడి. అది మా చుట్టిల్లూ. ఇది మా బావి. కొబ్బరి చెట్లూ, బాదంచెట్టూ, జాంచెట్టూ - మాకు చెట్లకేం కొరతలేదు. దొడ్డంతా నీడే; యిల్లంతా గాలే ... అదిగో ఆ పెద్ద రోలు వుంది చూశావు. మా వాడకట్టుకంతా ఇదే రోలు. ఆ రోలుకు ఆనుకుని అటు తిరిగి నిలబడి ఉంది చూశావు. అదే నా ఆఖరి మనుమరాలు. ఇటువయిపు తిరగవే పెళ్లికూతురా!' అంది.

నేను జడపాయలు అల్లుకుంటూ బెదురుచూపులు చూస్తూ ఇటువయిపు తిరిగాను.

ఆయన గుడ్లప్పగించి నన్నే చూస్తూ నిలబడిపోయారు...

ఆ తర్వాత చాలారోజుల వరకు మా లాయరుగారు ఏకాంతం దొరికితే చాలు 'నువ్వారోజు...' అంటూ మైమరపులోకి వెళ్లిపోయి, ''మీ దొడ్లో బాదంచెట్టు నీడలో నువ్వలా మీ రోలుకానుకొని నిలబడి జెమినీ వారి చంద్రలేఖ సినిమాలో హీరోయిన్ టి.ఆర్. రాజకుమారి లాగా అలవోగ్గా జడపాయలు విప్పుకుంటూ అల్లుకుంటూ, మళ్లీ విప్పుకుంటూ నలిగిన నేత చీరలో సాదాసీదాగా నేచురల్గా, అందంగా కనిపించావు కాబట్టి చూసిన వెంటనే నాకు నచ్చావు!'' అనేవారు.

అలా మా పెళ్లికి దారితీసిన మా రోలంటే నాకెంతో యిష్టం!

''చాలాచాలా సంవత్సరాల తర్వాత ఒకసారి ఎందుకో మా వూరికెళ్లవలసి వచ్చింది.

అప్పులవాళ్లపరమైపోయిన మా యింట్లో యిప్పుడు మిలటరీ హోటలు పెట్టారు. కారాపి, ఫలానా అని చెప్పి యిల్లంతా కలయతిరుగుతూ, చిన్ననాటి జ్ఞాపకాలు కలయబోసుకుంటూ యింటి వెనకాతలకు వెళ్లాను.

అప్పుడు మా రోలును చూడగానే నా గుండెల విసిపోయాయి.

రోళ్లు పగిలే ఎన్నో మండు రోహిణీకార్తెల్లో కూడా పగలనిది - తనను నిరాదరణకు గురిచేసి మా నాన్న ఆ ముండతో మెద్రాస్‌లో వేరే కాపురం పెట్టినప్పుడు, మా అమ్మ ఎన్నో నిశ్శబ్ద రాత్రిళ్లు దానిమీద కూర్చుని గుండెలు పగిలేటట్లు ఏడ్చినప్పుడు కూడా పగలనిది - తర్వాత ఎప్పుడు ఎలా పగిలిందో యిప్పుడు మధ్యకు పగిలి వుంది.

భూమిలోకి కృంగిపోయి వుంది.

నన్ను గుర్తుపట్టి నావంక దీనంగా చూస్తున్నట్లనిపించింది. నా కళ్లల్లో నీళ్లు వుబికాయి....